సాక్షి నల్లగొండ

ఆదివారం । 10 । నవంబర్ । 2024



డిసెంబర్ 9లోగా రుణమాఫీ

డిసెంబర్ 9లోగా రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 587.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 38,165 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 38,165 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 20,909 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 4,416 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.75 అడుగులు
ఇన్‌ఫ్లో	: 577.42 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 368 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

ఉచిత న్యాయ సేవలు అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న దీప్తి

రామగిరి (నల్లగొండ): పేదలు, స్త్రీలు, పిల్లలు, కార్మికులు ప్రకృతి బీభత్సంతో నష్టపోయిన వారికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బండి దీప్తి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్పీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన శిబిరంలో ఆమె మాట్లాడారు. న్యాయ సలహాలకు 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించి సలహాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, నిమ్మల భీమార్జున్‌రెడ్డి, నన్నూరి రాంరెడ్డి, అంథోని పాల్గొన్నారు.

ధాన్యం ఎగుమతులు వేగంగా జరగాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లతోపాటు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం మిల్లులకు వేగంగా ఎగుమతి చేయాలని డీఆర్‌డీఓ ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి సూచించారు. నకిరేకల్ మండలం చందంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల రికార్డులను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ ఉండకుండా ఏరోజుకారోజు మిల్లులకు తరలించాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని వస్తే కొనుగోలు వెంటనే జరుగుతాయన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం నరహరి, సీసీ పద్మ తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి

మిర్యాలగూడ: డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించే సీపీఎం జిల్లా 21వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శనివారం మిర్యాలగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభలకు జిల్లాలోని 33 మండలాలు, 8 మున్సిపాలిటీల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, డిసెంబర్ 2న మహా ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం సకాలంలో పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేయాలన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంతో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, అయూబ్, కూన్‌రెడ్డి వెంకటరెడ్డి, మాతంగి సోమయ్య, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను హారతితో కొలిచి, నిజాభిషేకం నిర్వహించి తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. అనంతరం ప్రధానాలయ మహాముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, లోక కల్యాణార్థమై నిత్యకల్యాణం చేపట్టారు. సాయంత్రం అలంకార జోడు సేవలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

నాన్న స్ఫూర్తి.. అమ్మ త్యాగం



భర్త ప్రోత్సాహంతో సివిల్స్ సాధించా

- మాది లవ్ మ్యారేజీ.. ప్రిపరేషన్‌లో ఆయన గైడెన్స్ ఎంతో దోహదపడింది
- సెలక్ట్ అయ్యాక 'సెవంటీ వన్ టూ ఫిఫ్టీ వన్' పుస్తకం రాశా
- మహిళల కోసం ములుగు జిల్లాలో ప్రత్యేకంగా కార్యక్రమాలు
- 'పోషణ్ పోట్లీ'తో పోషకాహార లోపం నివారించాం
- మహిళల అక్షరాస్యత, అభ్యున్నతే నా లక్ష్యం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

'అమ్మ త్యాగం, నాన్న స్ఫూర్తి, భర్త ప్రోత్సాహంతో సివిల్స్ సాధించా. నా కోసం, మా అక్క కోసం అమ్మ గిరిజ త్రిపాఠి టీచర్ ఉద్యోగాన్ని త్యాగం చేస్తే, సివిల్స్ సాధించాలన్న లక్ష్యాన్ని నాన్న పీఎస్ త్రిపాఠి నాలో నింపారు. సివిల్స్ ప్రిపరేషన్‌లో భర్త భవేశ్‌మిశ్రా ఎంతో ప్రోత్సహించారు'. అని చెబుతున్నారు నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి. 2017 బ్యాచ్‌కు చెందిన ఆమె ములుగులో పనిచేస్తున్నప్పుడు భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన ఐఏఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. అక్కడి నుంచి టూరిజం డైరెక్టర్‌గా వెళ్లిన ఆమె, ఇటీవల నల్లగొండ కలెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి' పాఠకుల కోసం ఆమె ఇన్నర్ వ్యూ..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

మాది లక్నో. నాన్న ఉత్తరప్రదేశ్ క్యాడర్‌లో ఫారెస్ట్ సర్వీసులో పనిచేశారు. తరువాత డిప్యూటేషన్‌పై కర్నాటకలో పనిచేశారు. ఏం చదువుకుంటే ఎక్కువగా ప్రజలకు సర్వీసు చేయవచ్చని చిన్నప్పటి నుంచి నాన్నను అడిగేదాన్ని. కలెక్టర్ అయితే ప్రజలకు మేలు చేయవచ్చని, ఎక్కడున్నా నిజాయితీగా పనిచేయాలని ఎప్పుడూ చెప్పేవారు. నాన్ననే స్ఫూర్తిగా తీసుకొని చదువుకున్నా.

ఢిల్లీలోనే బీటెక్.. అప్పుడే సివిల్స్ ఆలోచన

నేను ఢిల్లీలోని జేపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 2013లో బీటెక్ పూర్తి చేశాను. ఆ తరువాత లండన్ వెళ్లాను. అక్కడ లండన్ స్కూల్ ఎకనామిక్స్‌లో ఏడాది చదువుకున్నా. వెంటనే జాబ్ వచ్చింది. రెండున్నరేళ్ల మైక్రోసేవ్ కంపెనీకి చెందిన ఈక్విటీ బ్యాంక్‌లో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా జాబ్ చేశా. ఆరు నెలలు ఢిల్లీలో, ఆరు నెలలు లక్నోలో ఉండాల్సి వచ్చేది. చిన్నప్పుడు నాన్న చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని బీటెక్ చేస్తున్నప్పుడే సివిల్స్ సాధించాలని అనుకున్నా. జాబ్ చేస్తూనే 2015 జూన్ నుంచి సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వడం మొదలుపెట్టా. రెండో అటెంప్ట్(2017)లో సివిల్స్ సాధించా.

స్నోయి అంటే ఎంతో ఇష్టం



నాకు కుక్క పిల్లలంటే ఎంతో ఇష్టం. మా ఇంట్లో స్నోయి ఉంటుంది. అది రెస్క్యూ డాగ్. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో నా భర్త పనిచేస్తున్న సమయంలో ఒకరోజు టూర్‌కు వెళ్లారు. ఆ కుక్క వెహికిల్ కింద పడబోయింది. ఆయన వెంటనే వాహనాన్ని ఆపి, నాకు ఇష్టమని దానిని నా కోసం తీసుకొచ్చారు. అది ఇప్పుడు నాతోనే ఉంటుంది.

గైడెన్స్ అంతా ఆయనదే..

నా భర్తది ఢిల్లీ. నాకు రెండేళ్ల సీనియర్. అప్పటికే ఆయన ఐఏఎస్. బిహార్ క్యాడర్‌లో బాగల్‌పూర్‌లో పనిచేస్తున్నప్పుడే ఆయనతో పరిచయం ఏర్పడింది. నేను సివిల్స్ ప్రిపేర్ అవుతున్న సమయంలో ఎలా ప్రిపేర్ కావాలి, బుక్ లిస్ట్ కావాలని ఆయనకు మెయిల్ పంపించాను. అందుకు ఆయన స్పందించి ప్రోత్సహించడం మొదలు పెట్టారు. ఆయన సర్వీసులో ఉన్నా నా కోసం నోట్స్ తయారు చేసేవారు. గైడెన్స్ ఇచ్చేవారు. సెలక్షన్ తర్వాత 'నేను సెవంటీ వన్ టూ ఫిఫ్టీ వన్' పుస్తకాన్ని రాశాను. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే వారికి అది ఎంతో ఉపయోగపడుతుంది.

నాలుగేళ్ల తరువాత వివాహం

సివిల్స్ ప్రిపరేషన్ గైడెన్స్ నుంచి మా మధ్య ప్రేమ చిగురించింది. రెండేళ్లపాటు నా ప్రిపరేషన్ కొనసాగింది. మొత్తానికి నాలుగేళ్ల తరువాత మేం పెళ్లి చేసుకున్నాం. మాకు ఒక బాబు ఉన్నాడు.



మహిళలంతా బాగా చదువుకోవాలి

మహిళల అక్షరాస్యత నా కల. వారు బాగా చదువుకోవాలి. మా అమ్మానాన్న చదువుకున్నారు. అమ్మ టీచర్. మా అక్కా నేను బాగా చదువుకున్నాం. మాలాగే మహిళలంతా బాగా చదువుకొని ఎదగాలి. మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలన్నదే నా లక్ష్యం. వారికోసం ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తా. నేను ములుగులో ఉన్నప్పుడు బాబు పుట్టాడు. ఆ సమయంలో ములుగు ప్రాంత మహిళల్లో పోషకాహార లోపం తీవ్రంగా ఉండేది. అప్పుడే ఓ ఆలోచన వచ్చింది. ఇంట్లో నేను నా బిడ్డకు ఏ పోషకాహారం అందిస్తానో దానినే వారికి కూడా అందించాలని నిర్ణయించుకున్నా. 13 రకాల చిరు ధాన్యాలతో 'పోషణ్ పోట్లీ' అనే కార్యక్రమం అమల్లోకి తెచ్చా. పాలిచ్చే తల్లులు, ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సున్న పిల్లల ఎదుగుదలకు అది ఎంతో ఉపయోగపడింది. తక్కువ బరువు ఉన్న పిల్లలకు అందించడం వల్ల వారిలో చాలా మార్పు వచ్చింది. ఇది నాకు సంతృప్తినిచ్చింది.

దేశానికి ఆదర్శంగా నిలవాలి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే, వీసీ

- యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టుల భర్తీపై కేబినెట్‌లో చర్చిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎంజీయూలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులంతా దేశం ఆదర్శంగా తీసుకునే స్థాయికి ఎదగాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎంజీ యూనివర్సిటీలో రూ.38 కోట్లతో నిర్మించనున్న అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, బాలికల హాస్టల్ భవనం, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లో చదువుకున్న సుందర్ పిచాయ్ ప్రపంచం గర్వించదగ్గ స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. నేడు అన్ని వసతులు అందుబాటులోకి తెచ్చి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నామన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు సాధించడమే కాకుండా వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ప్రతి విద్యార్థి ఎదగాలన్నారు. విద్యార్థినులు కలెక్టర్‌ను ఆదర్శంగా తీసుకుని సివిల్ సర్వీసెస్‌లో రాణించాలన్నారు. అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. యూనివర్సిటీని తానే నెలకొల్పానని నాటి సీఎం వైఎస్సార్‌ను ఒప్పించి మహాత్మాగాంధీ యూనివర్సిటీని నెలకొల్పామన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా ఒక్క మెసేజ్ పెడితే పరిష్కరిస్తానన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఓయూ, జేఎన్‌టీయూ తరహాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు మంత్రి కోమటిరెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రభుత్వం నిర్వహించేలా చూడాలని, సైన్స్‌బ్లాక్‌కు అకడమిక్ భవనం నిర్మించాలని, ఖాళీలు భర్తీని చేయాలని కోరారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తే స్థలం ఇస్తామని చెప్పారు. వచ్చే ఏడాది బీపీఈడీ, డీపీఈడీ, ఫార్మసీ, లా కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రపంచాన్ని నడిపించేది మహిళలన్నారు. విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌ను లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అనంతరం ప్రతీక్ ఫౌండేషన్ రూ.10 లక్షల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను విరాళంగా అందజేశారు. సమావేశంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ప్రొఫెసర్ అంజిరెడ్డి, ప్రశాంతి, రమేష్, రమణారెడ్డి, అరుణ ప్రియ, రవి, మత్స్యేందర్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్

కుటుంబ వివరాలు జాగ్రత్తగా సేకరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: సమగ్ర సర్వేలో భాగంగా కుటుంబాల వివరాలు జాగ్రత్తగా సేకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సమగ్ర కుటుంబ సర్వేపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అనంతరం మాట్లాడారు. సర్వే సందర్భంగా వచ్చే సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. సర్వే వివరాలు సేకరించిన తర్వాత ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. సర్వే సమయంలో ప్రజలకు సందేహాలు వస్తుంటాయని, వాటిని నివృత్తి చేసి సర్వేను కొనసాగించాలన్నారు. కుటుంబ సర్వేపై పట్టణ, గ్రామస్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, హాజరయ్యారు.

ప్రజలంతా సర్వేకు సహకరించాలి

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం ప్రారంభమైన సర్వేను ఆమె జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ, హైదర్‌ఖాన్ గూడ కాలనీల్లో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే ఫారంలో తప్పులు లేకుండా జాగ్రత్తగా పూరించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కుటుంబ యజమానులు సమగ్ర సర్వే ఫారంపై పూర్తి సంతకం చేయాల్సిన అవసరం లేదని, కేవలం పొడి సంతకం చేసినా సరిపోతుందన్నారు. ఆమె వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమగ్ర సర్వేలో తప్పులు ఉండొద్దు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్

చిట్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, కుటుంబ సమగ్ర సర్వేలో తప్పులకు తావివ్వకుండా జాగ్రత్తగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ సూచించారు. చిట్యాల మున్సిపాలిటీలోని పదో వార్డులో శనివారం ప్రారంభమైన కుటుంబ సమగ్ర సర్వే తీరును ఆమె పరిశీలించారు. కుటుంబ సభ్యుల సమాచారాన్ని సేకరిస్తున్న తీరును ఎన్యుమరేటర్లను అడిగారు. అలాగే అందుతున్న సంక్షేమ పథకాలను, ఇతర ఇబ్బందులను ఆమె స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంతకుముందు చిట్యాలలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్య నిల్వలు, తూకం వేసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించి మహిళా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణనాయక్, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, పీఏసీఎస్ సీఈఓ బ్రహ్మచారి, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న అనితారామచంద్రన్

నేటినుంచి మత్స్యగిరీశుడి బ్రహ్మోత్సవాలు

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పరిధిలోని శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు. ఆలయ అధికారులు శనివారం ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఉత్సవాల ఆహ్వానపత్రిక అందజేశారు.

సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేయాలి



నల్లగొండలో కార్యకర్తలకు సభ్యత్వాలు అందజేస్తున్న రామచందర్‌రావు



వాగ్వాదానికి దిగిన కార్యకర్తలు

- పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ప్రముఖ్ రామచందర్‌రావు

నల్లగొండ టూటౌన్: బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ప్రముఖ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సంస్థాగత జిల్లా స్థాయి కార్యశాల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదు చేయించి రాష్ట్రంలోనే జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల కృషితో సభ్యత్వ నమోదులో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, మొగిలయ్య, బండారు ప్రసాద్, చెనగోని రాములు, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, పోతెపాక లింగస్వామి, పాలకూరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల మధ్య వాగ్వాదం..

బీజేపీ సభ్యత్వ నమోదు, సంస్థాగత కార్యాచరణ సమావేశంలో కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. నాగార్జునసాగర్ నియోజక వర్గంలో పనిచేసే వారికి పదవులు ఇవ్వకుండా డబ్బులు తీసుకుంటూ పదవులు కట్టబెడుతున్నారని ఆ నియోజక వర్గానికి చెందిన ఓ నాయకుడు అనడంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. సాగర్, నకిరేకల్ నియోజక వర్గాలకు చెందిన కార్యకర్తలు నువ్వెంత అంటే నువ్వెంత అని ఒకరికొకరు సవాళ్లు విసురుకున్నారు. ఇరువురు నాయకులు కొట్టుకునే వరకు వెళ్లడంతో పార్టీ ముఖ్య నాయకులు జోక్యం చేసుకుని ఇరువురికి సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

పత్తి రైతుకు వాట్సాప్ సేవలు

- పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు
- అమ్మకాలకు సంబంధించి రైతులకు పూర్తి సమాచారం తెలిసేలా..
- సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్న మార్కెటింగ్ శాఖ

వాట్సాప్ నంబర్ 88972 81111 కేటాయింపు



నల్లగొండ అగ్రికల్చర్: పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖను ఆదేశించింది. దీంట్లో భాగంగా ఆ శాఖ అధికారులు పత్తి పంట, పత్తి అమ్మకాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రైతులు ఇంట్లో నుంచే సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునేలా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకు 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కేటాయించారు. దీంతో రైతులు తమ సెల్‌ఫోన్లలో వాట్సాప్ ద్వారా పత్తి అమ్మకాలకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు.

రైతులు చేయాల్సిందిలా..

రైతు తమ సెల్‌ఫోన్‌లో ముందుగా తనకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని హాయ్ అని టైప్ చేసి ఎంటర్ చేయాలి. ఆ తర్వాత రైతులు జిల్లాలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్మకాలకు సంబంధించి అనేక వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ నియోజక వర్గాల్లో 22 పత్తి జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కోసం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు పత్తిని అమ్మేందుకు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌కు అనుసంధానం చేయాలి. ఆధార్ కార్డు పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్ ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబర్‌ను విధిగా పత్తి అమ్మేటప్పుడు సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

30 వేల క్వింటాళ్లే కొనుగోలు

జిల్లాలో ఇప్పటి వరకు 22 సీసీఐ కేంద్రాల ద్వారా కేవలం 30 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే ప్రైవేట్ వ్యాపారులు సుమారు 8 లక్షల క్వింటాళ్ల వరకు పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిసింది. సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం 8 నుంచి 12 శాతం వరకు ఉంటే కొనుగోలు చేసే అవకాశం ఉంది. కానీ, మూడు రోజుల వరకు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా రోజు విడిచి రోజు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తేమ శాతం 30 శాతం వరకు ఉండడంతో సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది.. దీంతో రైతులు విధి లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 43 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులు పత్తిని అమ్ముకునే క్రమంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాట్సాప్ సేవలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి. దీనిద్వారా పత్తి కొనుగోళ్ల వివరాలను తెలుసుకోవచ్చు. ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుంది.

– ఛాయాదేవి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, నల్లగొండ

వాట్సాప్ ద్వారా తెలుసుకునే వివరాలు ఇలా..

వాట్సాప్ ద్వారా రైతులు జిల్లాలోని 22 సీసీఐ కేంద్రాల్లో ఎన్ని క్వింటాళ్ల పత్తి అమ్మకానికి అర్హత ఉందో తెలుసుకునే అవకాశం ఉంది. ఏయే మిల్లుల వద్ద పత్తి అమ్మడానికి ఎంత సమయం వేచి ఉండాలో తెలుసుకోవచ్చు. పత్తి అమ్మకాల వివరాలు, తక్‌పట్టీ వివరాలు తెలుసుకోవచ్చు. పత్తి అమ్మకాలకు సంబంధించిన డబ్బుల చెల్లింపు వివరాలు తెలుసుకోవడంతో పాటు ఏదైనా సమస్య ఉంటే అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఉంది.

క్లుప్తంగా

జేఎన్‌వీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో(జేఎన్‌వీ) 2025–26 విద్యా సంవత్సరానికి గాను తొమ్మిదో తరగతి, పదకొండో తరగతిలో ప్రవేశానికి గాను దరఖాస్తు చేసుకోవాడానికి గడువును నవంబర్ 19వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 2025 ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దాడి దోపిడీకి పాల్పడిన గుర్తుతెలియని దుండగులు

బీబీనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామ శివారులో కారులో వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు అడ్డుకొని దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామానికి చెందిన ముక్కెర లింగస్వామి తన కారులో శుక్రవారం రాత్రి రాఘవాపురం వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని దుండగులు కారుకు అడ్డంగా వచ్చి లింగస్వామిని కారులో నుంచి కిందకు దింపారు. లింగస్వామిని చితకబాది, కత్తితో బెదిరించి ఆయన అకౌంట్‌లో నుంచి రూ.20 వేలను ఫోన్ పే చేయించుకుని విడిచిపెట్టారు. బాధితుడు బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారణ చేపడుతున్నారు.

బోరు మోటారు చోరీ

చౌటుప్పల్ రూరల్: వ్యవసాయ బోరు మోటారు, కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన అడ్లూరి శ్రీనివాస్ వ్యవసాయ భూమిలోని బోరు మోటారుతో పాటు కాపర్ వైరును శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీనివాస్‌కు పక్క భూమి రైతులు చోరీ జరిగిన విషయాన్ని చెప్పడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణమల్ సూర తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు



ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం, కారు

ఆలేరురూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం ఆలేరు మండలం కందిగడ్డ తండా శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా సిద్దెంకి గ్రామానికి చెందిన వీరబాబు, లవరాజు శనివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై భువనగిరికి వెళ్తున్నారు. ఆలేరు మండలం కందిగడ్డ తండా శివారులోని రాగానే వెనుక నుంచి కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబు తలకు తీవ్ర గాయాలు కాగా జనగామలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. లవరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరబాబు తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం పదిలం

- రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యురాలు మారకంటి భవాని



సదస్సులో పాల్గొన్న మారకంటి భవాని, టీడీఎఫ్ సభ్యులు

మర్రిగూడ: ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యురాలు మారకంటి భవాని అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని భారతి గార్డెన్‌లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఫోరం ప్రెసిడెంట్ మట్టా రాజేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎడుదొడ్ల వినీల్‌రెడ్డి సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మారకంటి భవాని హాజరై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై నిరంతరం కృషిచేస్తున్న టీడీఎఫ్‌ను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. అదేవిధంగా టీడీఎఫ్ యూఎస్‌ఏ అధ్యక్షుడు శ్రీనివాస్ మణికొండ మాట్లాడుతూ.. రైతుల ఆర్థికాభివృద్ధి, వినియోగదారుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కెమికల్స్, పురుగుమందుల వాడకంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో 3వ స్థానంలో ఉందని, ఇక్కడ ప్రతి హెక్టారుకు సుమారు 900 కిలోల పురుగు మందులు వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేల, విత్తనం నాణ్యతతో పాటు వ్యవసాయానికి సంబంధించిన మిత్ర పురుగులను సంరక్షించుకుంటే ఆహార పదార్థాలు మరింత రుచికరంగా ఉంటాయని పేర్కొన్నారు. కాగా ప్రకృతి వ్యవసాయదారులైన ప్రసాద్‌రెడ్డి, బైరెడ్డి నరేష్‌రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహారెడ్డి, ఇందిరా, నరేందర్‌రెడ్డి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా విశ్వ ఆగ్రోటెక్ కంపెనీ సీఈఓ బైరీ సుభాష్, కంపెనీ సేల్స్ అండ్ వైస్ ప్రెసిడెంట్ రాజు రైతులకు ఉచితంగా సేంద్రీయ ఎరువులు అందేశారు. కార్యక్రమంలో టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ రావుల విద్యాసాగర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఏఓ హేమలత, ఏఈఓలు విజయ్‌కుమార్, రాధిక, అరుణ, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను తిడితే సర్వనాశనమైపోతరు

- మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య, చిత్రంలో కంచర్ల భూపాల్‌రెడ్డి, బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: మాజీ సీఎం కేసీఆర్‌ను తిడితే సర్వనాశనమైపోతారని మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీనే మూసీని మురికికూపంగా మార్చిందన్నారు. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాతే మూసీ నీటిని శుద్ధిచేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేసీఆర్ వయసు కూడా చూడకుండా నోటికి ఎంత వస్తే అంతా మాట్లాడుతున్నారని, వారి భాష చూసి ప్రజలు ఈసడించుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను బుల్డోజర్‌తో తొక్కిస్తాం, ముక్కలు ముక్కలు చేసి మూసీలో వేస్తామని మాట్లాడటం మూర్ఖత్వం కాదా అని ప్రశ్నించారు. రూ.2లక్షల రుణమాఫీ ఎందుకు చేయలేదో, రైతుబంధు ఎందుకు ఇవ్వలేదో, పింఛన్లు రూ.4వేలకు ఎందుకు పెంచలేదో, మహిళలకు రూ.2500 ఎందుకు ఇవ్వలేదో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తన మంత్రి పదవి కాపాడుకోవడానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌ను జోకుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజలు తిరగబడటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కరీంపాష, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు గోపీనాథ్, బొమ్మరబోయిన నాగార్జున, కట్ట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- 117.3 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: పగలు సైకిల్‌పై రెక్కీ నిర్వహిస్తూ తాళం వేసిన ఇళ్లలో రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను సూర్యాపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం సూర్యాపేట రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ రవి ఈ కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. సూర్యాపేట రూరల్ పోలీసులు జనగామ క్రాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన కొండెపుడి రామకృష్ణను పట్టుకొని విచారించగా.. జూన్ నెలలో కుడకుడలోని పీఎస్ఆర్ టౌన్‌షిప్, అక్టోబర్ 31న వజ్ర టౌన్‌షిప్‌లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో పగలు సైకిల్‌పై తిరుగుతూ రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. అతడిపై 40 కేసులు నమోదు కాగా.. హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలులో రెండున్నర ఏళ్లు జైలు జీవితం గడిపినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 117.3 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సమావేశంలో సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలునాయక్, సిబ్బంది సుదర్శన్, వేణు, ఉమామహేశ్వర్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల: ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో శనివారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన రవి మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు అతడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరన్న తెలిపారు.

వివాహిత అదృశ్యం

నకిరేకల్: నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన పొన్నం మానస తన భర్తతో కలిసి అత్తగారి ఊరైన వలిగొండ మండల దుప్పలపల్లికి బస్సులో బయల్దేరారు. మార్గమధ్యలో నకిరేకల్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులో చేరుకోగా.. మానస వాష్‌రూమ్‌కు వెళ్లి వస్తానని భర్తకు చెప్పి బస్సు దిగి కనిపించకుండా పోయింది. మానస భర్త తన అత్త స్వరూపకు సమాచారం ఇవ్వడంతో ఆమె నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

భువనగిరిలో సదర్ సమ్మేళనం

- ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు



సదర్ సమ్మేళనంలో పాల్గొన్న అనిల్‌కుమార్‌యాదవ్, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, క్యామ మల్లేష్, బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తాలో శనివారం రాత్రి సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున యాదవులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలేరు ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ విప్ గొంగిడి సునీత, మాజీ ఎంపీ బడుగు లింగయ్యాయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు క్యామ మల్లేష్, అంబర్‌పేట శ్రీనివాస్, తోటకూరి వజ్రేస్‌యాదవ్, అందె లింగంయాదవ్, పుట్ట వీరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అతిథులకు యాదవులు పగడిని అందజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

భువనగిరిటౌన్: యాదవులకు అండగా నిలవాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించి జీఓ జారీ చేశారని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. సదర్ ఉత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సీఎంకు యాదవుల తరఫున కతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సదర్‌ను రాష్ట్ర పండుగ చేసి రూ.1.50 కోట్లు కేటాయించారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యయాదవ్ అన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ కృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఇంత పెద్దగా చేసుకోవడం గర్వంగా ఉందని అన్నారు. యాదవులు రాజకీయంగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. కార్యక్రమంలో దూదిమెట్ల బాల్‌రాజుయాదవ్ ఉన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



బాలయ్య (ఫైల్)

బొమ్మలరామారం(తుర్కపల్లి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలంలో జరిగింది. శనివారం ఎస్‌ఐ తక్యూద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన గుల్లని బాలయ్య(38)కు 16 సంవత్సరాల క్రితం మమతతో వివాహం జరిగింది. కానీ వారికి సంతానం లేదు. మద్యానికి బానిసైన బాలయ్య భార్య మమత, తల్లి లక్ష్మితో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ నెల 7వ తేదీన మద్యం మత్తులో ఉన్న బాలయ్య భార్య మమతతో పాటు తల్లి లక్ష్మిని కొట్టాడు. దీంతో వారు ఇరువురు సైదాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన బాలయ్య 8వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మమత బాలయ్యకు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో వారు బాలయ్య ఇంటికి వెళ్లి చూడగా ఉరి వేసుకొని విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రేత రిమాండ్

మునుగోడు: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. చండూరు సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలానికి చెందిన ఆరుగురు యువకులు మునుగోడులో గంజాయి విక్రయిస్తుండగా.. జూలై 20వ తేదీన అప్పటి మునుగోడు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆరుగురిపై కేసు నమోదు చేసి ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. ఆకారపు గణేష్ అనే యువకుడు శనివారం పట్టుబడడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలిని హత్య చేసి ఆభరణాలు చోరీ !

- మంగాపురంలో ఘటన

వేములపల్లి: వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన వేములపల్లి మండలం మంగాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. శనివారం మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మంగాపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల లక్ష్మమ్మ (75) తన పెద్ద కుమారుడు దుర్గయ్య, కోడలు చంద్రకళతో కలిసి నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం దుర్గయ్య, చంద్రకళ వ్యవసాయ పనులకు పొలానికి వెళ్లగా లక్ష్మమ్మ ఒక్కతే ఒంటరిగా ఇంట్లో ఉంది. దుర్గయ్య పొలం పనులను ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి లక్ష్మమ్మ ఇంటి వరండాలో పడి ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. లక్ష్మమ్మ చెవులకు రక్తపు మరకలు ఉండడం, ఆమె ఒంటిపై నల్లపూసల గొలుసు, చెవి దిద్దులు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి లక్ష్మమ్మను హత్య చేసి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు నిర్ధారించుకుని వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశంకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకటేశం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్‌ఐ వెంకటేశం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. లక్ష్మమ్మ చెవి మాత్రమే తెగి ఉండటం, శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడం, ఒక చెవి దిద్దు అక్కడే పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతురాలి కుమారుడు దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సీత మధు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన సీత మధు (29) షాపులకు పాల ప్యాకెట్లు విక్రయించి జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 6వ తేదీ రాత్రి కొత్తగూడెంలో షాపులల్లో పాల ప్యాకెట్లు వేసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. పోచంపల్లి మండల శివారులోని నేతాజీ కాలేజీ సమీపంలో రోడ్డుకు అడ్డంగా అడవి పందులు రావడంతో వాటిని తప్పించే క్రమంలో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో మధు తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు శస్త్రచికిత్స నిమిత్తం రూ.20లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలపడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తలకు గాయం కావడంతో కోమాలోకి వెళ్లిన మధు శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె, ఏడాది వయస్సు కల్గిన కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి బాలయ్య కూడా ఏడాది క్రితం కొత్తగూడెం వద్ద రోడ్డు దాటుతుండగా ట్రావెల్ బస్సు ఢీకొని మృతిచెందాడు. మధు కూడా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో పెను విషాదం నెలకొంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుర్రంపోడు: మండలంలోని ఎర్రగ్లగూడెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ పి. మధు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగ్లగూడెం గ్రామానికి చెందిన వంటెద్దు రాంరెడ్డి శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి రూ.లక్ష నగదు, అర్ధ తులం బంగారం ఎత్తుకెళ్లారు. సాయంత్రం పొలం వద్ద నుంచి ఇంటికి వచ్చిన రాంరెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అతివేగంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

నకిరేకల్: కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి నకిరేకల్ పట్టణంలో జరిగింది. మాడుగుపల్లి మండలం కల్వలపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పోకల రాజు తన కారులో కేతేపల్లి మండలం చెరుకుపల్లికి చెందిన డ్రైవర్ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. వీరు కేతేపల్లి మండలం బండపాలెం, చెరుకుపల్లి మీదుగా కల్వలపాలెం చేరుకోవాల్సి ఉంది. మార్గమధ్యలో శుక్రవారం అర్ధరాత్రి నకిరేకల్ పట్టణంలో ఎస్ఎల్ఎన్ షాప్ సమీపంలో మెయిన్ రోడ్డు వెంట ఉన్న విద్యుత్ స్తంభానికి కారు అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో విద్యుత్‌స్తంభం విరిగిపడింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో పోకల రాజుతో పాటు డ్రైవర్ ప్రసాద్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిద్దరిని స్థానికులు 108 వాహనంలో నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని 14 గొర్రెలు మృతి

దేవరకొండ: లారీ ఢీకొని 14 గొర్రెలు మృతిచెందిన ఘటన శనివారం దేవరకొండ మండలం పద్మట్‌పల్లి సమీపంలో జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మట్‌పల్లికి చెందిన వెంకటమ్మ శనివారం సాయంత్రం గొర్రెలను మేపుకొని గ్రామానికి వెళ్తుండగా.. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వస్తున్న లారీ గొర్రెలను ఢీకొట్టింది. 14 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.2లక్షల మేర ఉంటుందని బాధితురాలు వాపోయింది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలిప్పిస్తామని టోకరా

మఠంపల్లి: మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఆరుగురు యువకులకు ఓ వ్యక్తి ఫోన్ చేసి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలిప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేశాడు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్న ఆరుగురు యువకులకు మధు అనే వ్యక్తి సెప్టెంబర్ నెలలో వీడియో కాల్ చేసి.. తాను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తున్నానని, తమ కార్యాలయంలో నెలకు రూ.20వేల వేతనంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపాడు. ఉద్యోగం కావాలంటే ముందుగా ఒక్కొక్కరు రూ.12వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, తాను అయ్యప్ప మాలధారణలో ఉన్నానని, మోసం చేసేవాడిని కాదని నమ్మబలికాడు. ఆరుగురు రూ.12వేల చొప్పున మొత్తం రూ.72వేలు ఫోన్‌పే ద్వారా మధుకు చెల్లించారు. రోజులు గడుస్తున్నప్పటికీ ఉద్యోగాల జాడ చెప్పకపోవడం, డబ్బు తీసుకున్న వ్యక్తి ఆచూకీ దొరక్కపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన ఆరుగురు యువకులు నాలుగు రోజుల క్రితం మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అతడు.. ఆమెగా..

- ఓ మహిళ ఫొటోతో వివాహ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్
- లైక్ కొట్టిన వృద్ధుడితో ఫోన్‌లో యువతిగా గొంతుమార్చి పరిచయం
- చివరికి పెళ్లికి సై అన్న ఆటోడ్రైవర్
- వరంగల్‌కు పిలిపించి మరో ఇద్దరితో కలిసి చితకబాదిన వైనం
- బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ పోలీసులు

హసన్‌పర్తి: కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆ ఆటోడ్రైవర్ సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో ఓ వివాహ వెబ్‌సైట్‌లో మహిళ ఫొటోతో ప్రొఫైల్ క్రియేట్ చేశాడు. అదే మహిళ పేర సిమ్‌కార్డులు తీసుకున్నాడు. ఆ ప్రొఫైల్‌ను లైక్ కొట్టిన ఓ వృద్ధుడితో ఫోన్‌లో ఆడ గొంతుతో మాట్లాడి పరిచయం పెంచుకున్నాడు. చివరికి పెళ్లి దాకా తీసుకువచ్చాడు. వరంగల్ నగరానికి రమ్మని చెప్పి మరో ఇద్దరితో కలిసి ఆ వృద్ధుడిని చితకబాది నగదు తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు మహిళ కోసం గాలిస్తున్నారు. హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గోదారి శేఖర్ ఆటోడ్రైవర్. ఆటోతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. దీంతో సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో పబ్లిక్‌గార్డెన్ సమీపంలో పరకాలకు చెందిన లక్ష్మి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె పేరు, ఫొటోతో రెండు కంపెనీలకు చెందిన సిమ్ కార్డులు తీసుకున్నాడు. జోడీ.కామ్ (jodi.com) వైబ్‌సైట్‌లో లక్ష్మీ పేర ఓ ప్రొఫైల్ క్రియేట్ చేసి ఫొటో అప్‌లోడ్ చేశాడు. ఈ ప్రొఫైల్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్ అనే వృద్ధుడు లైక్ కొట్టి వివరాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌తో శేఖర్ తన పేరును లక్ష్మిగా పరిచయం చేసుకుంటూ ఆడ గొంతుతో మాట్లాడడం ప్రారంభించాడు.

వాట్సాప్‌లో చాటింగ్..

ఆ పరిచయం వాట్సాప్ చాటింగ్ వరకు వెళ్లింది. తనకు భార్య లేనందున పెళ్లి చేసుకుంటానని దేవులపల్లి శ్రీనివాస్.. శేఖర్ (లక్ష్మి)కు చెప్పగా అంగీకరించాడు. గత నెల 25న హనుమకొండ బస్టాండ్‌కు వస్తే, తన వారు వస్తారని శ్రీనివాస్‌కు.. శేఖర్(లక్ష్మి) ఫోన్ చేసి చెప్పాడు. ఆ రోజు శ్రీనివాస్ హనుమకొండ బస్టాండ్‌కు రాగా, గోపాలపురానికి చెందిన దుర్గం రాజయ్య, లక్ష్మయ్య అనే ఇద్దరిని శేఖర్ బస్టాండ్‌కు పంపించాడు. వారు శ్రీనివాస్‌ను ఆటోలో ఎక్కించుకుని కోమటిపల్లి రైల్వేట్రాక్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న శేఖర్ వారిద్దరితో కలిసి శ్రీనివాస్‌ను చితకబాదారు. జేబులు వెతకగా డబ్బులు లభించలేదు. చివరికి రూ.24వేలు ఫోన్ పే చేయించుకున్నారు.

బాధితుడి ఫిర్యాదు,.. కేసు నమోదు..

బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ దర్యాప్తు వేగవంతంగా చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గోపాలపురం శివారులో నిందితుడు శేఖర్‌తోపాటు దుర్గం రాజయ్య, లక్ష్మయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ చెప్పారు. మరో నిందితురాలు లక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.24వేల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో కేయూసీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను ఏసీపీ అభినందించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

బొమ్మలరామారం(తుర్కపల్లి): తుర్కపల్లి మండలంలోని మాధాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన 68వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ క్రీడలలో అండర్–14 బాలుర విభాగంలో ఖమ్మం జిల్లా జట్టు ప్రథమ స్థానం, నల్లగొండ జట్టు ద్వితీయ స్థానం, రంగారెడ్డి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచారు. అండర్–14 బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా జట్టు ప్రథమ స్థానం, ఖమ్మం జిల్లా జట్టు ద్వితీయ స్థానం, రంగారెడ్డి జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో రంగారెడ్డి జిల్లా జట్టు, మూడో స్థానంలో నల్లగొండ జిల్లా జట్టు నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ మాలతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి, పబ్బ చంద్రశేఖర్, చింతపండు వెంకటేశం, లింగంపల్లి విజయ్, మాజీ సర్పంచ్ యాట పెంటయ్య, కొమొరిశెట్టి నర్సింహులు, సుంకరి శెట్టయ్య, మహదేవుని శ్రీనివాస్, ఎరుకల వెంకటేష్, బొమ్మ రవీందర్ పాల్గొన్నారు.